
# కథల కామరాజు

- మహాసముద్రం దేవకి

ఈ భూమ్మీద మా అడ్రసు లేని రోజుల్లో నమ్మిన బంటు లాంటి మా యింటి జీతగాని గురించి మా అమ్మ చెప్తుంటే వాడిని చూడాలని, వాడిప్పుడు మా యింట్లో పని చేస్తుంటే ఎంత బాగుండేదని అన్పించేది మాకు.

వాడి పేరు కుప్పడు. తమిళనాడు లోని తిరువణ్ణామలై నుంచి వచ్చి దాదాపు ఐదేండ్లు మా యింట్లో పని చేసి వున్నట్టుండి సొంత యింటి మీద గుబులు వుళ్లి వెళ్లిపోయినాడు. వెళ్లేటప్పుడు పదే పదే మళ్ళీ రమ్మని చెప్పినా రాలేదని చెప్పేది మా అమ్మ.

కుప్పడు మళ్లీ వస్తే బాగుణ్ణు అని మాకు అన్పించడానికి ఒక బలమైన కారణముంది. వాడు వేరుశెనక్కాయలు ఒలుస్తూ తమిళ భాషలో చెప్పిన కథల్ని మాకు అర్థమయ్యేట్టుగా తెలుగులో చెప్పేది మా అమ్మ. ఆ కథల్లో రాజ కుమారులు, రాజ కుమార్తెలు, నక్కలు, తోడేళ్లు, శవాన్ని పూడ్చిన గుంతలో నుంచి ఆ శవం పాట రూపంలో ఆవేదనను వ్యక్తం చేయడం మొదలైన వాటితో కూడుకొని వినడానికి చాలా ఆసక్తిగా వుండేవి. పాటలు మాత్రం మా అమ్మ తమిళంలోనే పాడి విన్పించేది.



మావూరు తమిళనాడు బార్డర్‌లో వుండడం వల్ల అక్కడి వాళ్లందరికి తెలుగు, తమిళం రెండు భాషలూ వస్తాయి. ఇంట్లో పెద్దవాళ్లందరూ తమిళంలోనే మాట్లాడుకొనేవాళ్లు. ఎందుకలా చేసేవాళ్లో ఇప్పటికీ అంతు పట్టదు.

ఇంకో చిత్రమేమిటంటే మా వూరిని, మాలపల్లిని వేరు చేస్తూ తారు రోడ్డుండేది. మాలపల్లి వాళ్లు మా పొలాల్లో కూలినాలి చేసేవాళ్ళు. వాళ్ళు ఆంధ్రాలో వున్నా తమిళమే మాట్లాడేవాళ్లు. కానీ పనిపాటలకు వచ్చినప్పుడు మా వూరి పిల్లలతో మాట్లాడాల్సివస్తే వాళ్లు తెలుగులో మాట్లాడే వాళ్లు. మా పిల్లలందరం వాళ్లతో అరవంలోనే మాట్లాడేవాళ్లం.

వాళ్లు తెలుగు మాట్లాడినా, పిల్లలం అరవంలో మాట్లాడినా చాలా కృత్రిమంగా అనిపించేది. అయినా



## దమ్ము కొడుతోన్న నాలుగేళ్ళ బుడతడు!

పిల్లలకు తల్లిదండ్రులే మొదటి గురువులు. ఇల్లే మొట్టమొదటి పాఠశాల. పిల్లల ముందు పెద్దలు ఏదీ చేసినా, తిరిగి వారలా నడుచుకునే అవకాశముంది. వారి ముందు ఏ పని చేసినా, ఏమి మాట్లాడినా కాస్త ఆచితూచి వ్యవహరించాలి. లేకపోతే మన పిల్లలు వాటికి అలవాటు పడే ప్రమాదముందని చాలా మంది పెద్దలు ఇప్పటికి చెప్పకనే చెప్పిన సందర్భాలు కోకొల్లలు. తండ్రి అడుగుజాడల్లో నడవాలనుకున్నాడేమో తైవాన్ కుర్రాడు, నాలుగేళ్ళు కూడా లేవు. పదేళ్ళ అన్నయ్యతో కలిసి నాన్నలా దమ్ము మీద దమ్ము పీల్చేస్తున్నాడు. పైగా దాన్ని నాన్న జేబులోంచి దొంగిలించి దొంగచాటుగా ఎడాపెడా కాల్చేస్తున్నాడు. ఇదేంటని అడిగితే "మా నాన్న సిగరెట్టు కాల్చినప్పుడు ఎంత కూల్‌గా వుంటాడో! అందుకే నేను కూల్‌గా ఉండాలని.. ఇలా ఓ దమ్ము పీలుస్తున్నానని" సగర్వంగా విన్నవించాడు. పాపం, ఆ తండ్రి నెత్తినోరు బాదుకున్నాడు. ఇంకెప్పుడు పిల్లల ముందు తాగనని తెగేసి చెప్పాడు. మొక్కగా వున్నప్పుడే ఏ మొక్కైనా వంగుతుంది. మానయ్యాక వంగాలంటే కష్టం. తల్లిదండ్రులారా! మీ పిల్లలపై ప్రభావం చూపే వాటికి కాస్త దూరంగా వుండేలా చూసుకోండి.

అందులో మార్పు మాత్రం వుండేది కాదు.

ఒకరోజు నేను, మా అక్క స్కూలు నుంచి ఇంటికి వచ్చేసరికి పశువుల కొట్టంలో ఆవుల్ని కట్టేస్తూ ఒక కొత్త వ్యక్తి కనిపించాడు.

సాధారణంగా మావూరికి ముళబాగల్, పుంగనూరు, నెల్లిపట్ల మొదలైన వూర్ల నుంచి ఇంట్లో చెప్పాపెట్టకుండా అలిగి వచ్చే వాళ్ల సంఖ్య ఎక్కువనే చెప్పాలి. అలా వచ్చిన వాళ్లు రోడ్డులో చింత చెట్ల క్రింద వున్న బండ మీద కూర్చున్న మా వూరి వాళ్లతో మాటలు కలిపి ఏమైనా పని ఇప్పించమని అడగడం, వాళ్లు మా యిల్లు చూపడం, అలా వచ్చినవాళ్లు మా యింట్లో పనికి కుదరడం మామూలే. కుప్పడు కూడా ఒకప్పుడు అలా వచ్చినవాడే.

ఇంట్లో అడుగు పెట్టగానే మా అమ్మ "కుప్పా గ్లాసెడ్తుక్కో కంజిత కుడిపివి," (కుప్పా, గ్లాసు తీసుకో, గంజి నీళ్ల త్రాగుదువు) అని కేకేసింది. సంబోధన వినగానే మా మొహాల్లోకి ఒక్కసారిగా వెలుగు ప్రసరించింది. చిన్నప్పుడు మమ్మల్ని ఎత్తి దించినవాడే అయినా వూహ తెలిసిన తర్వాత చూడకపోవడం వల్ల మాకసలు తెలియదు. కానీ వచ్చినవాడు కుప్పడనగానే అందలమెక్కినంత సంబరమయింది. పోగొట్టుకున్న పెన్నిధి చేతికి దొరికినట్లయింది. ఏవో కష్టాల ఊబి నుండి గట్టెక్కినంత రిలీఫ్.

"తిరువణ్ణామలై కుప్పడామ్మా అతను?" అని అడిగింది మా అక్క. "ఆఁ" అని "కుప్పా ఇంగువా," (కుప్పా ఇక్కడికిరా) అని పిలిచింది మా అమ్మ. అతను రాగానే "ఇవంగు యారో సొల్," (వీళ్లెవరో చెప్పు) అంది మమ్మల్ని ఉద్దేశించి.

"పెరి పాపా, సిన్ని పాపా," (పెద్ద పాపా, చిన్న పాపా) అన్నాడు నవ్వుతూ.

కుప్పనితో కథ చెప్పించుకోవాలని మా కోరిక. రాత్రి 7 గంటల కల్లా భోజనాలు ముగించి వాకిట్లో చాపలు పరచుకొని కుప్పణ్ణి కథ చెప్పమని సతాయించాము.

ఒక కథ మాత్రం చెప్పి నిద్రొస్తుందంటూ వెళ్లి ఎద్దులకొట్టంలో మట్టి అరుగుపైన వున్న తౌడు బస్తాను క్రింద పెట్టి అరుగు దులుపుకొని పడుకొన్నాడు.

కుప్పడు చెప్పే కథల్ని అర్థం చేసుకోవడానికి మాకు కొంత కాలం పట్టింది. చాలా స్పీడుగా కామా, ఫుల్‌స్టాప్ లేకుండా చెప్తాడు. ఆ కథ మధ్యలో వచ్చే పాటలు పాడేటప్పుడు ఒక్క పదం కూడా స్పష్టంగా వినిపించదు. అందుకే అతని కథ అర్థం కాని చోట మా అమ్మను అడిగి చెప్పించుకొనే వాళ్ళం.

కుప్పడి కథల్ని అర్థం చేసుకున్న మా అమ్మకు సులభంగా ఒక పది డాక్టరేట్‌లు ఇవ్వవచ్చని నాకనిపిస్తుంది.

కుప్పడు చెప్పిన కథల్లో మాకందరికి బాగా నచ్చిన కథ నక్క కథ. ఆ కథ ఇది: ఒక ఊర్లో ఒక రైతుకు ఏడుగురు కొడుకులు, ఒక కూతురు ఉంటారు. ఒక రోజు ఏడుగురూ పొలంలో పని చేస్తుంటే వాళ్ల చెల్లెలు వాళ్లకు సంగటి తీసుకెళ్తుంది. పొలానికి వెళ్లే దారిలో ఒక పెద్ద చెరువు. ఆ చెరువు నిండా నీళ్లు. ఆ నీళ్లలో దిగి వెళ్లడానికి భయపడి ఆ కట్ట దగ్గరే ఏడుస్తూ ఉంటుంది. ఇంతలో అక్కడికి ఒక నక్క వచ్చి "ఎందుకు సిరి పాపా! ఏడస్తా వుండావు. నీకొచ్చిన కష్టమేమి? నష్టమేమి?" అని అడుగుతుంది. ఆ పాప ఏడుస్తూనే, "నా కష్టాన్ని నువ్వేం ఆర్చేదానివా? తీర్చేదానివా? నీకు నేను చెప్పను పో!" అంటుంది. "ఆరుస్తాను – తీరుస్తాను చెప్పు పాపా" అని బలవంతం చేస్తుంది నక్క.

ముద్దులకొలికినైన నాకు ఏడుగురు అన్నదమ్ములు. చెరువుకవతల చేనిలో మడకలు కట్టి దున్నుతా ఉన్నారు. వాళ్లకు సంగటి తెచ్చినాను. చెరువు నిండా నీళ్లే. ఎట్ల దాటాలో తెలియట్లేదు," అంటూ బొట బొటా కన్నీళ్లు కార్చిందా పాప.

"ఓస్, ఇంతే కదా! దీని కోసం ఇంత ఏడవాలా? నీ కష్టాన్ని నేను తీరుస్తాను. నాకేమిస్తావు?" అతి అడుగుతుంది నక్క. "నా ఏడుగురన్నదమ్ములు తినే సంగట్లో కొంచెం కొంచెం తుంచి మిగలబెట్టి నీకు తెచ్చిస్తా" నంటుంది.

నక్క చెరువులోని నీళ్లంతా తాగేసి పాపకు దారి చూపిస్తుంది. చెప్పిన మాట ప్రకారం సంగటి కూడా మిగలబెట్టి దాన్నొక పెద్ద ముద్ద చేసి కొంటెతనంతో వచ్చేదారిలో ఉండే పల్లేరు కాయల్ని కన్పించకుండా ఆ సంగటి లోపల గుచ్చి నక్కకు తెచ్చిస్తుంది.

నక్క అపురూపంగా ఆ ముద్దను చేతిలోకి తీసుకుని తుంచుకొని గుటుక్కు గుటుక్కున మింగేస్తుంది. ఆ సంగటి లోపల ఉండే పల్లేరు కాయలు నక్క గొంతులో చిక్కుకోవడంతో అల్లాడిపోతుంది. గొంతంతా గాయాలతో నిండి రక్తం కారుతుంటుంది.

తనకు ద్రోహం చేసిన ఆ పాపపైన నక్కకు కోపం ముంచుకొస్తుంది. తోకతో తపా తపా పాపను శరీరమంతా రక్తం కారేట్లు కొడ్తుంది. పాప గజ గజ ఒణికిపోతుంది.

"ఈ గాయాలతో ఇంటికి వెళ్తే ఏం జరిగిందని అమ్మా నాన్న అడుగుతారు. వాళ్లకు నిజం చెప్పానంటే నేను చేసిన దుర్మార్గానికి వాళ్లు నన్ను చంపేస్తారు. ఏం చేయాలబ్బా" అని దారి పొడవునా ఆలోచించింది పాప. ఏమీ తోచలేదు.

ఇంటికెళ్లిన పాప భయంతో అటకెక్కి కూచుంది. అప్పుడు వాళ్లమ్మ ఇంట్లో లేదు. పప్పు రుబ్బుకొని రావడానికి పొరుగింటికి పోయింది. "పొలానికి పోయిన పిల్ల ఇంకా రాలేదేమి?" అనుకుందామె. "వాళ్లన్నా వాళ్లతో కలిసొస్తుంది కాబోలు" అనుకుంది.

కొడుకులు పొలం పని చేని అలసి సొలసి వస్తారు. ఆ లోపల వడలు చేసి పెట్టాలని వాళ్లమ్మ పొయ్యి ముట్టించి బాణలి పెట్టి నూనె పోసింది. నూనె కాగింది. గిన్నెలో నీళ్లు, ఒక గుడ్డ తీసుకుంది. ఇంకో గిన్నెను బోర్లవేసి గుడ్డను నీళ్లలో ముంచి బోర్లించిన గిన్నె పైన పరచి పిండి తీసుకొని ఎగరేసి ముద్ద చేస్తుంటే నూనెలో "సుయ్ సుయ్"మని ఏదో కారింది.

తనింకా వడలు తట్టి నూనెలో వెయ్యనేలేదు. అప్పుడే అది సుయ్ సుయ్ మంటోంది ఏమిటా! అని పైకి చూసింది. ఏమీ కన్పించలేదు. నూనెలో మాత్రం బొట్లు బొట్లుగా ఏదో కారుతూనే ఉంది.

చేతిలో పనొదిలిపెట్టి ఏమిటా? అని అటకెక్కి చూసింది. గుండె గుభేలుమంది. కూతురి మొహం నిండా రక్తపు చారలు. వాటి నుండి బొట్లు బొట్లుగా రక్తం కారుతోంది.

"ఏమిటే ఇది" అని కిందికి దించి మెల్లగా

అడిగింది. వణికిపోతున్న పాప జరిగిందాన్ని చెప్పడానికి భయపడి ''సంగటి ఆలస్యంగా తీసుకు పోయినానని చింత బర్ర తీసుకొని చిన్నన్న తిప్పి తిప్పి కొట్టాడమ్మా'' అనింది.

తల్లి కడుపు కాలిపోయింది. ఇంతలో తండ్రి కూడా ఇంటికొచ్చాడు. కొడుకులు ఎప్పుడొస్తారా అని కాచుక్కూచున్నారు.

చివరికి పొద్దు పోతుండగా కొడుకులు ఇల్లు చేరుకున్నారు. భుజాల మీదున్న మడకల్ని మదురు గోడకు ఆనించి గొడ్లకు నీళ్ళు తాగించి కాళ్ళు, ముఖాలు కడుక్కొని ఇంట్లోకి అడుగు పెట్టినారు.

చెల్లెలు సిరిపాప చెంబుల్లో నీళ్ల తెచ్చి ఆరుగురు అన్నలకు ఇచ్చింది. ఏడోవాడు నీళ్ల కోసం చేయి చాపాడు. సిరిపాప ఇవ్వలేదు సరికదా! చెంబులో నీళ్లని పక్కనే ఉన్న పూల చెట్లకు పోసి ఇంట్లోకి పరుగు తీసింది.

''నీళ్లియ్యమంటే నాకివ్వవెందుకమ్మా?'' అని చెల్లెల్ని ముదిగారంగా ప్రశ్నిస్తున్న చిన్నకొడుకును వెదురు జాటి తీసుకొని ఈడ్చి ఈడ్చి కొట్టడం మొదలు పెట్టాడు తండ్రి.

తండ్రి తమ్ముడ్ని దెబ్బలతో ఎందుకు దండిస్తున్నాడో అన్నలకు అర్థంగాక అయోమయంలో పడిపోయారు.

సమాధానంగా తల్లి నోరు విప్పింది, ''ఏడుమంది కొడుకులు పుట్టినా కూతురు లేని లోటు ఎవరూ తీర్చలేనిదని ముప్పొద్దులా ఒక్క పొద్దుండి మీ చెల్లెల్ని కన్నాము. సంగటి ఆలస్యంగా తెచ్చిందని దాన్ని చావ గొడ్తాడా మీ తమ్ముడు!'' అంది.

ఆ మాట విని అవాక్కయి తెలివి తెచ్చుకొని వాడి తప్పేమీ లేదని, చెల్లెలు చెప్పింది అబద్ధం అని అన్నలు నోరు విప్పే లోపే ఆఖరి వాడు తెలివి తప్పి పడిపోయాడు.

పడినవాడు పడినట్లే ఈ పాపపు భూమ్మీద ఉండరాదని ప్రాణాలు వదిలేశాడు. తల్లి తండ్రి రాత్రికి రాత్రే పొలం వెళ్ళే దారిలో గుంత తవ్వి కొడుకును పూడ్చిపెట్టారు. ఆరుగురు కొడుకులు తమ్ముడి తప్పేమి లేదని, పైగా మా అందరికంటే వాడికే చెల్లెలి పైన ప్రేమ ఎక్కువని తల్లిదండ్రులను కూచో బెట్టుకొని చెప్పారు. దానికి పాప తలలో ఉన్న, వాడిపోయినా ఇంకా ఘుమ ఘుమలాడు తున్న, అడివి మల్లిపూలే సాక్ష్యమన్నారు.

''ఎంత ప్రేమ లేకపోతే వాడు మా కంటే ముందే పోయి అడవి మల్లిపూలు కోసి మాల కట్టి పాప కోసం ఉంచుతాడు...'' అన్నారు.

తల్లితండ్రీ ఆవేశంలో తప్పు చేసినందుకు ఎంతగానో కుమిలి పోయారు. అయినా ముద్దుల కూతురు సిరిపాపను దండించ లేదు. దానికి తొందరగా పెళ్లి చేసి అత్తవారింటికి పంపేయాలనుకున్నారు.

ఉత్తర దేశం నుంచి ఎద్దుల యాపారాని కొచ్చిన రంగయ్య కొడుకు రామయ్యకిచ్చి పెళ్లి చేయాలనుకున్నారు. చిన్న కొడుకు పెంచి పెద్ద చేసిన ఎద్దుల్ని కట్నంగా ఇచ్చారు.

ఆకాశమంత పందిరి వేసి దానికి భూదేవంత అరుగువేసి అట్టహాసంగా పెళ్లి ఏర్పాట్లు చేశారు. ఆరుగురు అన్నలు అన్నీ దగ్గరుండి చూసుకున్నారు. గుడ్డాగుసురు, నగలూ నాణేలు కోరింది కోరినట్లుగా చెల్లెలికి తెచ్చిచ్చారు. కాని ఎంత ప్రయత్నం చేసినా పెళ్లికూతురి తల్లోకి మూరెడు పూలు కాదు కదా! ఒక్క పువ్వు కూడా సమకూర్చ లేకపోయారు.

పూలు లేని పెండ్లీ ఒక పెండ్లేనా పూలు తెస్తే తప్ప పెళ్లి జరగదని తల్లి తలపట్టుక్కూచుంది. ఆరుగురన్నలు ఆరుదిక్కులకు వెళ్లారు. తండ్రో దిక్కుకు వెళ్లాడు. ఎంత దూరం నడిచినా ఎన్ని సంతల్లో వెదికినా ఒక్కటంటే ఒక్క పువ్వు దొరకలేదు. అందరూ తిరిగొచ్చి పందిటి క్రింద చేరి విచారంతో ఉండగా పశువులు కాసే పిల్లవాళ్లొచ్చి భూమండలం మీదున్న రకరకాల పూలన్నీ ఉత్తర దిక్కులో చిన్నకొడుకును పూడ్చిపెట్టిన గుంత మీద విరగబూసి ఉన్నాయని చెప్పారు.

వెంటనే పెద్ద బుట్ట పట్టుకొని తండ్రి బయలుదేరాడు. ముచ్చటైన రంగులతో, ఒద్దికైన రూపాలతో సువాసనల్ని వెదజల్లే ఆ పూలను చూడగానే సిరిపాప అదృష్టమే అదృష్టం అని మురిసిపోయాడు.

బుట్ట పక్కన పెట్టిపై గుడ్డ పక్కంగా వొడిగట్టి పూలు కోయడానికి వంగాడు. వెంటనే పూలన్నీ మాయమై గుంటలోపలికి వెళ్లిపోయాయి. దాన్ని కళ్ళారా చూసిన తండ్రి చిన్న కొడుకును పూలిమ్మని బతి మాలాడు. అప్పుడా గుంతలో నుంచి మధుర మైన పాట ఒకటి విన్పిం చింది. ఆ పాట కుప్పడి మాటల్లో:

''వాలన్న అది చాన్ను
వరనాడు పోయిరక
చిన్నన్న అది చాన్ను
చొల్లుదు నట్టెరి
నట్టెరి పారమేల,
ఉత్తమ కొండైకు
ఉరంద నెరి కాంబువ్వ
పత్తిని కొండైకు పరంద
నెరింకాంబువ్వ
అందపావి చెండాలికి
నానెప్పడి కుడిప్పిం''

భావం: నక్క చావగొట్టి దాని దోవన అదిపోతే చిన్నన్న కొట్టినాడని చెప్పిన ఆ పాపి తలకు ఉత్తమమైన గన్నేరు పూలను, చామంతి పూలను నేనెట్లా ఇచ్చేది చెప్పు నాన్నా అన్నాడు. ఆ ప్రశ్నకు బదులు చెప్పే మొహం లేక తండ్రి వెనుదిరిగాడు. ఆ తర్వాత వరుసగా ఆరుగురు అన్నలు, తల్లి వెళ్ళి అడిగారు. వాళ్ళకూ అదే ప్రశ్న మిగిలింది.

చివరికి పెళ్ళి కూతురే వెళ్ళి ప్రాధేయపడింది. నక్క కొట్టిందంటే నన్ను కొడతారని నువ్వు కొట్టావని చెప్పి నీ చావుకు కారణమైన నాకు చావు తప్ప వేరే ప్రాయశ్చిత్తం లేదని చెల్లెలు అన్న గుంత మీదున్న బండరాయికి తలగొట్టుకోబోయింది. అప్పుడు అన్న గుంతలో నించి పైకొచ్చి చెల్లెలి ప్రయత్నాన్ని ఆపాడు. అన్న కూడా పెళ్లికి ప్రయాణమయ్యాడు. చెల్లెలు వెనక ఏడు ఎద్దుల బండ్లలో ఏడుగురన్నలు పూలతో నిండిన బండ్లను తోలుకుంటూ ఊర్లోకొచ్చారు. చెల్లెలికి అంగరంగ వైభోగంగా పెళ్లి చేసి పంపారు.

కథను కుప్పడు చెప్పాలి. మనం వినాలి అనేది అమ్మ. కానీ మాకు మాత్రం కుప్పడు చెప్పే కథల్ని అమ్మ నోటి ద్వారా వింటేనే అర్థమయ్యేది. ఒక్కో కథను అమ్మతో ఒకసారి చెప్పించుకొని మళ్లీ కుప్పణ్ణి చెప్పమని సతాయించే వాళ్లం. రెండోసారి కుప్పడు చెప్పే ఆ కథలు వినసొంపుగా ఉండేవి.

కుప్పడు మా యింటినుంచి మళ్లీ ఎప్పుడు తిరువణ్ణామలైకు ఉరికెత్తుతాడో అని భయం భయంగా ఉండేది. కాని వాడు మాత్రం ఎక్కడికీ పోననే చెప్పేవాడు. అయినా అమ్మకు వాడి పైన అపనమ్మకమేమో! మా వూర్లోనే ఉన్న మందడి ఎల్లన్న కూతురు మాణిక్యాన్నిచ్చి మా అమ్మే దగ్గరుండి పెళ్లి జరిపించింది.

సమాజంలో వచ్చిన మార్పులు పల్లెటూళ్లపై

"ఆకాశంలో గ్రహాలు ఎన్ని ఉన్నా వెలుగు నిచ్చేది సూర్యుడొక్కడే
లోకంలో మ్యారేజ్ బ్యూరోలు ఎన్ని ఉన్నా పెళ్లి కుదిర్చేది కాకతీయ ఒక్కటే"

కాకతీయ మ్యారేజెస్ ప్రై. లిమిటెడ్
103, 109 & 203, విజయశ్రీ అపార్ట్‌మెంట్స్, చర్మాస్ వెనుక, అమీర్‌పేట్, హైదరాబాద్ - 500 073.
ఫోన్ : 040-2374 7777, 09396 999 999


శ్రీమతి & శ్రీ చిరంజీవి యలమంచి

FREE online registration & Free search
AN ISO 9001:2000 ORGANISATION
www.kaakateeya.com
www.telugumarriages.com
www.kannadamarriages.com
www.tamilmarriages.com

| | | | |
|---|---|---|---|
| అమీర్‌పేట్ | 098481 55222 | చెన్నై (అన్నానగర్) | 093839 99999 |
| కూకట్‌పల్లి | 093913 11444 | (చెన్నై) టి. నగర్ | 093400 99993 |
| ఆర్‌టిసి క్రాస్ రోడ్స్ | 099855 47475 | (చెన్నై) పోరూర్ | 093855 99077 |
| దిల్‌సుఖ్‌నగర్ | 098485 66733 | (చెన్నై) తాంబరం | 093400 99993 |
| విజయవాడ | 093922 92939 | బెంగుళూరు | 093429 39345 |
| గుంటూరు | 098485 35375 | జయానగర్ | 093429 39343 |
| తెనాలి | 098480 31931 | మైసూరు | 093429 39342 |
| విశాఖపట్నం | 098481 63833 | కోయంబత్తూరు | 093457 94668 |
| రాజమండ్రి | 098485 35377 | సేలం | 093855 99066 |
| కాకినాడ | 098483 37378 | మధురై | 093603 35233 |
| ఖమ్మం | 093470 59988 | వెల్లూర్ | 093449 94400 |
| ఒంగోలు | 098487 11223 | తిరుచి | 098428 01111 |
| నెల్లూరు | 098481 97222 | పాండిచ్చేరి | 098421 27777 |
| తిరుపతి | 098485 35378 | ఈరోడ్ | 093855 99011 |
| కర్నూలు | 093900 33815 | అనంతపూర్ | 093460 09348 |

www.kaakateeya.com

ప్రభావాన్ని చూపాయి. నగరాలు విపరీతంగా విస్తరించాయి. బ్యాంకులు రుణాలివ్వడంతో ప్రతి ఒక్కరికి సొంత ఇల్లు కట్టుకోవాలనే కాంక్ష పెరిగింది. ఇంటిపనికి పోతే కూలి డబ్బులు ఎక్కువ రావడమేగాక ఇసుక, ఇటుకలు తోలేటప్పుడు ట్రిప్పు ట్రిప్పుకు కాఫీలు, టీలు ఇప్పించేవారు. ఆ కారణంగా సేద్యం పనులకు వచ్చే కూలీల సంఖ్య పడిపోయింది. ఎవరి పొలాల్లో వాళ్లు అంటే సొంత మనుషులే పని చేసి పండించుకోవలసిన పరిస్థితి ఏర్పడింది.

మా యింట్లో వాళ్లకు పొలంలో పని చేసే అలవాటు లేకపోవడం వల్ల మా పొలాలన్నీ కుప్పడు గుత్తకు తీసుకున్నాడు. భార్యా భర్త ఇద్దరూ పని చేసే వాళ్లు. పండింది వాళ్ల దయతలచి ఎంత ఇస్తే అంత మేము తీసుకొనే వాళ్లం. దాంతో కుప్పడు మమ్మల్ని మించిపోయాడు. మంచి యిల్లు కట్టుకున్నాడు. కొడుకును కాన్వెంట్లో చేర్చాడు. పెళ్లాం మంచి చీరలు కట్టుకొనేది.

మా స్థితి నానాటికీ దిగజారిపోయింది. ఒకప్పటి మోతుబరి రైతులందరూ పూట గడవని స్థితికి చేరుకున్నారు. వర్షాలు లేక వ్యవసాయం కుంటుబడినా వాళ్లు కూలికి పోయి సంపాదించుకోగలరు. ఆ కారణంగా కుప్పడు బాగానే డబ్బు వెనకేసుకున్నాడు. కాని మేము మాత్రం మా తాతలు నేతులు తాగారు, మా మూతులు వాసన చూడండని ఎచ్చులకు పోయి ఎనకేసిందంతా కరిగించుకొని చివరికి ఉన్న పొలాల్ని కూడా నాలుగు దుడ్లకు దారబోసుకున్నాము.

మా పొలాల్ని కుప్పడే కొనుక్కున్నాడు. డబ్బు బాగా ఖర్చు పెట్టి బోరు వేశాడు. నీళ్లు బాగా పడినాయి. దాంతో భార్యా భర్త ఇద్దరూ ఒళ్లొంచి పని చేసి డబ్బు సంపాదిస్తుంటే పట్నంలో చదువు పేరుతో కొడుకు జల్సా చేస్తూ వచ్చాడు.

కుప్పడు అడపాదడపా మా యింటి కొచ్చే వాడు. ఒకప్పుడు ఎద్దులకొట్టంలో కూచొని పోసిన సద్దిని దోసిళ్లతో తాగే కుప్పడు ఇప్పుడు స్టీలు గ్లాసులో ఇచ్చే కాఫీని యింట్లో కూచొని తాగుతున్నాడు. కుర్చీ మీద కూర్చోమని మేమంతా బలవంతం చేస్తాము. కానీ కూర్చోడు.

మా అక్క పెళ్ళికి 30 వేలు తక్కువబడితే మా నాన్న అడగలేక అడగలేక కుప్పణ్ణి అడిగాడు. కానీ ఐదారేండ్లయినా ఆ ముప్ఫైవేల అప్పు అప్పుగానే వుండిపోయింది. వడ్డీ మాత్రం ఏవో తిప్పలు పడి కట్టేస్తున్నాము.

కుప్పడి కొడుకు పట్నంలో ఉద్యోగంలో చేరాడు. అక్కడ ఇంటి పని మొదలు పెట్టాడని అడగలేక అడగలేక డబ్బు అవసరమొచ్చిందని అడిగాడు కుప్పడు.

కట్టేసి కొట్టినా నాన్న దగ్గర చిల్లి గవ్వలేదని మా అందరికి తెలుసు. కూర్చొని తినే మాకు ఎంత ఆస్తి అయితే మాత్రం ఎన్నాళ్లుంటుంది. దాంతో కుప్పడు అడిగిన ప్రతిసారీ మా నాన్న వాయిదాలు వేస్తూనే వచ్చాడు. కుప్పడు గట్టిగా అడగలేక గుక్కిళ్లు మింగుతున్నాడని మా అందరికీ తెలుసు.

కుప్పడికి వాడి కొడుకుకూ మధ్య ఏం రాద్ధాంతం జరిగిందో తెలియదు కాని ఒకసారి కొడుకు వచ్చి నాలుగు రోజులు గడువిచ్చి ఆ లోపల ఇవ్వకుంటే మర్యాద దక్కదని హెచ్చరించిపోయాడు. ఆ రోజు రాత్రి మా యింటి పొయ్యిలో పిల్లి లేవలేదు.

ఐదురోజులు తర్వాత మళ్లీ వచ్చాడు కుప్పని కొడుకు. వాడు మోటార్ బైక్ దిగలేదు. కళ్లకున్న కూలింగ్ గ్లాసులు తీయలేదు. వయసుకు కూడా గౌరవమివ్వకుండా మా నాన్నను నానా మాటలన్నాడు. చుట్టుప్రక్కల వాళ్లంతా గుమికూడారు.

ఆవేశం తట్టుకోలేని మా అన్న ''పోవాయ్, బోడి డబ్బు నువ్వే చూశావ్ కాని వారం రోజుల్లో అణాపైసలతో సహా విసిరి పారేస్తాము,'' అన్నాడు. వాడు విసురుగా వెళ్లిపోయాడు.

అనవసరంగా నోరు పారేసుకున్నావని మా అమ్మా నాన్న మా అన్నను తిట్టారు. ''వాడు మర్యాద లేకుండా అందరి ముందు అలా మాట్లాడొచ్చా,'' అని అన్న ఉక్రోషం.

''ఒకప్పుడు కుప్పడు మనింట్లో జీతగాడు కాబట్టి ఉంటే వాడికింతో అంతో దయాదాక్షిణ్యాలు, గౌరవాభిమానాలుంటాయి. వాడి కొడుకు కెందుకుంటాయి?'' అని సర్ది చెప్పాడు నాన్న.

మర్నాడే నాన్న యిల్లు అమ్మకానికి పెట్టాడు. ఈ లోపల కుప్పని కొడుకు 'మర్యాద లేకుడా తిట్టి కొట్టడానికి వచ్చాడ'ని అన్నపైన ఎస్సీ కమీషన్‌కు ఫిర్యాదు చేశాడు. దాంతో మా యింటి పరిస్థితి పుండు మీద కారం చల్లినట్లయింది. ఆ దిగులుతో అమ్మా నాన్న మంచం పట్టారు.

కొడుకు తన యజమాని యింటిని అల్లకల్లోలం చేశాడన్న దిగులుతో కుప్పడు కూడా మంచం పట్టాడని తెలిసింది. కుప్పడు కేసు వాపసు తీసుకోమని ఎంతగానో బతిమాలాడట. అయినా వాడు వినలేదు. చివరికి ఎమ్మెల్యేలు కల్పించుకొని ఇద్దర్నీ కలిపి కాంప్రమైజ్ అయ్యేట్లు చేశారు. ఈ లోపలే ఒకరోజు కంబడి కప్పుకొని భార్య చెయ్యి పట్టుకొని కుప్పడు మా నాన్నను చూడ్డానికి వచ్చాడు. నాన్నకా విషయం చెప్పకుండానే అన్న వాళ్లను తరిమేశాడు.

మళ్ళీ ఒకరోజు మాణిక్యం మా యింటికొచ్చింది. కుప్పనికి కాన్సరని చెప్పారని, తిండి నీళ్ల మానేశాడని అమ్మ, నాన్నల పేర్లు కలవరిస్తుంటాడని చెప్పింది. అయినా వెళ్లి చూడ్డానికి యజమానన్న అహం అడ్డొచ్చింది కాబోలు! ఎవరూ వెళ్లలేదు.

చివరికి కుప్పడు కన్ను మూశాడు. ఆ విషయం తెలిసి అమ్మ చూడ్డానికి వెళ్లింది. మాణిక్యం అమ్మ కాళ్లను చుట్టేసుకొని ఏడ్చిందట. నాన్న పైన దిగులుతోనే కుప్పడు మంచం పట్టాడనీ, చచ్చేటప్పుడు కూడా 'అప్పా' (నాయనా) అని కలవరించాడని ఏడ్చింది. అమ్మ వెంటనే ఇంటికొచ్చి నాన్నకా విషయం చెప్పి కళ్లనీళ్లు పెట్టుకొంది. చూసి రమ్మని బతిమాలింది.

నాన్న పరిస్థితి కూడా అంతంత మాత్రంగానే వుంది. అన్నను బస్తీకి పంపి పూలహారం తెప్పించాడు. నడవలేని నాన్న ఒంటెద్దు బండి కట్టించుకొని వెళ్లాడు. నాన్నను చూసి అక్కడున్న వాళ్లందరు గొల్లుమని ఏడ్చారు. నాన్న పూలమాలను స్వయంగా తన చేతులతో కుప్పనికి అలంకరించాడు. దినాలు రోజు చివరిసారి వేసే పసుపు కుంకుమ పూలు మాణిక్యానికి మా అమ్మే తీసుకెళ్ళింది.

మూడు నెలలు గడిచింది. టౌన్లో కొడుకింట్లో ఉండిచిక్కి శల్యమైన మాణిక్యం అక్కడ వుండలేక మళ్లీ మా యిల్లు చేరుకుంది. పని లేకపోయినా, పనిమనిషి అవసరం లేకపోయినా, మా కడుపులు నిండడమే సమస్యగా ఉన్నా మాణిక్యం మా యింట్లోనే వుండి పోతాననడం మా అందరి కడుపుల్లో కుండెడంబలి పోసినట్లయింది. కుప్పడి ఆత్మ కూడా శాంతించి వుంటుందనిపించింది.

